క్లుప్తంగా

కార్డుదారులకు రేషన్ అందేలా చూడాలి



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

పెద్దదోర్నాల: కార్డు దారులందరికీ రేషన్ అందేలా చూడాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ రేషన్ డీలర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 15వ తేదీ వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచాలన్నారు. దీంతో పాటు ఆథరైజేషన్ పత్రాలు, రేషన్ దుకాణాలకు సంబంధించిన బోర్డులు, ధరల పట్టిక, స్టాక్ వివరాలను నిత్యం సరిచూసుకోవాలన్నారు. దీంతో పాటు వయోవృద్ధులు, వికలాంగులకు రేషన్ వారి ఇళ్ల వద్దే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ డీలర్ల సంఘ మండల అధ్యక్షుడు దేసు నాగేంద్రబాబు, పులుకూరి పుల్లయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన జోంతన్

దర్శి (కురిచేడు): దర్శి మండలం రాజంపల్లి వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం, ఆ తర్వాత లారీ ఢీకొట్టడంతో కాలు విరిగింది. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాలు.. దర్శికి చెందిన గర్నెపూడి జోంతన్ తన ద్విచక్ర వాహనంపై పొదిలి వెళ్తున్నాడు. రాజంపల్లి వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తేరుకునే లోపు లారీ కాలిపై నుంచి వెళ్లింది. జోంతన్ ఎడమకాలు పాదం నుజ్జునుజ్జయింది. 108కి సమాచారం అందించటంతో సిబ్బంది బాలజ్యోతి, ఖాదర్ బాషాలు సంఘటన స్థలానికి వచ్చి ప్రథమ చికిత్స చేసి క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు ఒంగోలు తీసుకెళ్లారు.

చిన్నగుడిపాడులో ఇరువర్గాల ఘర్షణ



గాయపడిన వల్లభనేని ప్రసాద్, వల్లభనేని వెంకటేశ్వర్లు

పెద్దదోర్నాల: గ్రామంలోని బోరు వద్ద ఏర్పడిన చిన్న వివాదం చినికి చినికి గాలివానగా మారి ఇరువర్గాల నడుమ ఘర్షణకు దారి తీసింది. దీంతో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడంతో ఒక వర్గానికి చెందిన వల్లభనేని ప్రసాద్, వల్లభనేని వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. వీరిని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. క్షతగాత్రుల కథనం ప్రకారం.. ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలోని బోరు వద్ద వివాదం చోటుచేసుకుంది. ఇరువర్గాల నడుమ తొలుత వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక వర్గానికి చెందిన వారు కర్రలతో దాడులు చేసి తమను గాయపర్చినట్లు మరో వర్గానికి చెందిన వల్లభనేని ప్రసాద్, వల్లభనేని వెంకటేశ్వర్లు ఆరోపించారు. దాడుల్లో మరో వర్గానికి చెందిన అయినేని పెద్ద ఆంజనేయులు, అయినేని చిన్న ఆంజనేయులకు గాయాలయ్యాయి. వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

తాగునీరు లేక అవస్థలు



నిరుపయోగంగా తాగునీటి ట్యాంక్

పెద్దారవీడు: మండలం నలుమూలల నుంచి వివిధ పనుల కోసం ప్రజలు మండల కేంద్రం పెద్దారవీడు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామానికి చెందిన దాత నీటి ట్యాంక్‌ను నిర్మించారు. అప్పుడే స్థానికంగా ఉన్న పంచాయతీ డీప్ బోరు నుంచి ట్యాంక్‌కు పైపుల ద్వారా అధికారులు నీరు సరఫరా చేశారు. వివిధ పనులపై వచ్చే ప్రజలు ట్యాంక్ ద్వారా వచ్చే నీటిని తాగి కొద్దిసేపు చెట్ల కింద సేద తీరేవారు. తహసీల్దార్, మండల పరిషత్, మండల విద్యాశాఖ, జాతీయ ఉపాధి హామీ, గృహ నిర్మాణ శాఖ, పశువైద్యశాల, వ్యవసాయ శాఖ, వెలుగు, సొసైటీ, సచివాలయం కార్యాలయాలు ఒకే ఆవరణలో ఉన్నాయి. 19 పంచాయతీలకు సబంధించిన ప్రజలు నిత్యం వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. ప్రజలు దాహార్తి తీర్చుకోవాలంటే షాపుల్లో అర లీటర్ రూ.2 చెల్లించి తాగాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. దాతలు కట్టించిన నీటి ట్యాంక్‌కు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు తాగునీరు నింపక పోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. కొంత మంది తాగునీటి కోసం ట్యాంక్ వద్దకు వెళ్లి చూడగా నీరు రావడం లేదని వెనుదిరిగి చెట్ల కింద ఉంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో షాపుల వద్ద అర లీటరు రూ.2 కొనుగోలు చేసి దాహం తీరక మళ్లీ రూ.2 చెల్లించి తాగునీరు తాగుతున్నామని ప్రజలు చెబుతున్నారు. అసలే ఎండలు మండిపోతున్న తరుణంలో ట్యాంక్‌లో సమృద్ధిగా నీరు నింపితే ప్రజలు ఎప్పుడు పడితే అప్పుడు తాగేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరూపయోగంగా ఉన్న ట్యాంక్‌కు నీటిని నింపి దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేగంగా అటవీ అతిథి గృహ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న అటవీశాఖ అతిథి గృహం



అతిథి గృహం ప్రాంగణంలో చెట్ల సముదాయం

- సకల సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న ఫారెస్ట్ బంగ్లా

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఫారెస్ట్ బంగ్లాలో నూతనంగా నిర్మిస్తున్న అటవీశాఖ అతిథి గృహం పర్యావరణ పరిరక్షణకు మారు పేరుగా రూపుదిద్దుకుంటోంది. సువిశాల ప్రాంగణంలో పచ్చని చెట్ల మధ్య అధునాతన హంగులతో నిర్మిస్తున్న అటవీశాఖ అతిథి గృహం ఈ ప్రాంతంలో పర్యటించే అటవీశాఖ అధికారులకు సౌకర్యంగా మారనుంది. దశాబ్దాల క్రితం ఇదే ప్రాంతంలో బ్రిటిష్ వారి హయాంలో అతిథి గృహం ఉండేది. ఈ ప్రాంతంలో పర్యటించిన ఎందరో అధికారులకు ఆతిథ్యాన్ని అందించిన నాటి బంగ్లా పురాతనంగా మారటంతో కొద్ది రోజుల కిందట దాన్ని పడగొట్టి నూతన అతిథి గృహాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్ల అనంతరం రూ.40 లక్షలతో నూతనంగా అతిథి గృహాన్ని నిర్మిస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఈ అతిథి గృహం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నల్లమల అటవీ ప్రాంతాన్ని సందర్శించేందుకు వచ్చే ఉన్నతాధికారులకు వసతి సౌకర్యాలు కల్పించనుండటంతో బంగ్లాకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. దీంతో బంగ్లాకు సంబంధించిన ఇంటీరియల్ పనులను చకచకా చేపడుతున్నారు. బంగ్లాకు సంబంధించిన డబుల్ కాట్ బెడ్‌లు, ఫర్నిచర్ రావాల్సి ఉంది. దీంతో పాటు అక్కడక్కడా కొంచెం పనులు మిగిలి ఉన్నాయని, త్వరలోనే వాటిని పూర్తి చేసి ఫారెస్ట్ బంగ్లాను అందుబాటులోకి తేనున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే బూచేపల్లికి నేతల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే బూచేపల్లితో తాళ్లూరు వైఎస్సార్ సీపీ నాయకులు

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కురిచేడు మండల అనుబంధ సంఘాల సభ్యులు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దర్శిలోని పార్టీ కార్యాలయంలో వారికి పూలమాలలు వేసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వైవీ సుబ్బయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగుల మూడి లింగారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు అంకె కృష్ణ, సారెడ్డి నాగిరెడ్డి, మూలె నాగమణి, బీసీ సెల్ అధ్యక్షుడు అంకె వెంకటేశ్వర్లు, పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబరు కె.నరసింహ, నాయకులు ఎన్వీ నాగిరెడ్డి, వెలుతుర్ల కొండలురెడ్డి, మూలె బాలిరెడ్డి, మేరువ పిచ్చిరెడ్డి, రమణారెడ్డి, పాల్గొన్నారు.

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మండల దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు సన్నపురెడ్డి వెంగళరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబరు ముతికాపల్లి గురవారెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి భిక్షాలురెడ్డి, మండల పార్టీ కార్యదర్శి పుచ్చా రవి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు బిజ్జం కృష్ణారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు దుగ్గినేని రామకృష్ణలు దర్శి పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో కేటాయించిన పదవులకు గౌరవం లభించేలా, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం డాక్టర్ శివప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, నాయకులు అప్పిరెడ్డి, అచ్చారావు పాల్గొన్నారు.

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని బుధవారం ఆ పార్టీ ఆఫీసులో వివిధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో మండల రైతు విభాగం అధ్యక్షుడు గువ్వల శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ వింగ్ అధ్యక్షుడు మందా శ్యాంసన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యామర్తి ప్రభుదాస్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జగన్నాథం సురేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రావినూతల కోటేష్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు అనపర్తి యోహోన్ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులకు బూచేపల్లి సూచించారు. వీరి వెంట మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆలోకం హరిబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుమ్మడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు పూనూరి దేవదానం, నారాయణరెడ్డి, సంగు కొండారెడ్డి, సత్యం, లతీఫ్, సయ్యద్ ఉన్నారు.



ఎమ్మెల్యే బూచేపల్లికి కృతజ్ఞతలు తెలుపుతున్న భిక్షాలురెడ్డి, ఇతర నేతలు



ఎమ్మెల్యే బూచేపల్లిని సన్మానిస్తున్న అనుబంధ సంఘాల నాయకులు

నాయకులకు ఎమ్మెల్యే తాటిపర్తి అభినందనలు



అరుణాబాయి, వెంకటేశ్వరరెడ్డిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న బుజ్జి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాలకు ఎంపికైన నాయకులను ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షురాలు రమావత్ అరుణా బాయి, మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ బుజ్జి (నూర్ అహ్మద్)లకు ఆయన శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు సజావుగా నిర్వహించాలని ఆయన సూచించారు. తమపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి పదవులకు ఎంపిక చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో పుణ్యక్షేత్రం శ్రీ గొర్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 9వ రోజు బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, పూర్ణాహుతి, వసంతోత్సం, హారతులు తదితర పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం ప్రాంగణంలో అలంకరించిన హంస వాహనంపై ఉత్సవమూర్తులు కొలువై మంగళ వాయిద్యాల నడుమ విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం సాయంత్రం రాజంపల్లి గ్రామంలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహిస్తారు.

ఆర్టీసీ బస్టాండ్ కోసం స్థల పరిశీలన



మాట్లాడుతున్న డిపో మేనేజర్ శంకరరావు

దొనకొండ: పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ వి.శంకరరావు దొనకొండలో బస్టాండ్ కోసం స్థలాన్ని బుధవారం పరిశీలించారు. దొనకొండలో ఆర్టీసీ బస్టాండ్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చాలా సార్లు ప్రజలు డిపో మేనేజర్‌కు అర్జీల రూపంలో విన్నవించారు. ఆ సందర్భంగా మేనేజర్ శంకరరావు దొనకొండకు వచ్చి గ్రామ ప్రజలతో, ప్రయాణికులతో కొద్దిసేపు మాట్లాడి ఇక్కడి సమస్యలు తెలుసుకున్నారు. పొదిలి, మార్కాపురం ఆర్టీసీ డిపోల నుంచి దొనకొండకు బస్సు సౌకర్యం కల్పించాలని, అదే విధంగా ఈ ప్రాంత ప్రజలు నిత్యం శ్రీశైలం వెళ్తుంటారని, గతంలో అద్దంకి నుంచి వయా దొనకొండ, కుంట మీదుగా శ్రీశైలం బస్సు నడిపే వారని, ఆ బస్సు సేవలు లేక పోవటంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారని మేనేజర్‌కు వివరించారు. స్పందించిన ఆయన దొనకొండ మీదుగా హైదరాబాద్, శ్రీశైలం వెళ్లేందుకు బస్సు ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతానికి వారంలో ఒక్క రోజు బస్సును నడుపుతామని, ఈ ప్రాంత ప్రజలు అలవాటైన తర్వాత ప్రజల కోరిక మేరకు రోజూ బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీనికి స్థానికులు కూడా స్పందిస్తే ఆర్టీసీ ఆదాయం పెరుగుతుందని, ప్రయాణికులకు ప్రయాణంసౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. ఆయన వెంట సర్పంచ్ కొంగలేటి గ్రేస్ దేవానంద్, వార్డు సభ్యులు, ప్రజలు ఉన్నారు.

తీగలేరుతోనే సస్యశ్యామలం

- రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్



పోస్టుకార్డు ఉద్యమానికి హాజరైన రైతులు

పుల్లలచెరువు:

ప్రభుత్వం తీగలేరు కాలువకు నిధులు మంజూరు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చాపలమడుగులో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో శాశ్వత నీటి సౌకర్యం లేక పోవడంతో వ్యవసాయం చేయాలంటే దిన దినగండంగా మారిందని, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో 1000 అడుగుల మేర బోర్లు వేసినా నీరు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంతానికి తీగలేరు కాలువ వస్తే తప్ప నీటి సమస్య తీరదన్నారు. నీటి సౌకర్యం లేకుంటే మరి కొన్నిరోజుల్లో తీవ్ర కరువ ప్రాంతంగా మారే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగు, సాగు నీరు లేకుంటే ప్రజలు, పశువుల జీవన విధానం ఎలా ఉంటుందో అధికారులు, నాయకులు ఆలోచన చేయాలన్నారు. ప్రభుత్వాలు పలుసార్లు దీనిపై నివేదికలు ఇచ్చినా కదలిక లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతం సస్యశ్యామం కావాలంటే శాశ్వత నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. దీని కోసం ప్రజలు రాబోయో రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు వెనకాడరని, ప్రతి గ్రామం నుంచి వందలాది మంది రైతులు తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టు సమస్యను పరిష్కరించి తీగలేరు కాలువకు నిధులు కేటాయించి పనులు సకాలంలో పూర్తి చేయాలని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు జానకి రఘు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో ప్రజలతో పాటు రైతులు పడుతున్న ఇబ్బందులు గమనించి అభివృద్ధికి పాటు పడాలని, నీటి కోసం ఉద్యమాలు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ప్రభుత్వం పట్టించుకోకపోతే త్వరలోనే పుల్లలచెరువు మండలం ఏడారిగా మారే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తీగలేరు సాధన కమిటీ సభ్యులు గురునాథం, రఘు, టీసీహెచ్ చెన్నయ్య, కోటిరెడ్డి, రామయ్య, వెంకటేశ్వరరెడ్డి, చిన్న ఓబులయ్య, బసవయ్య, నారాయణ పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



పెద్దారవీడు: మట్టి నమూనా పత్రాలు అందజేస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ



పెద్దదోర్నాల: పొలం పిలుస్తోందికి హాజరైన రైతులు

పెద్దారవీడు: ఖరీఫ్ సీజన్లో వేయబోయే పంటలకు ముందు విత్తన శుద్ధి చెస్తే పంట తొలి దశలో వచ్చే చీడపీడలని అరికట్టవచ్చని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని బి చెర్లోపల్లి, బద్వీడు రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, తద్వారా తగిన మోతాదులో ఎరువులు వాడటంతో పాటు తక్కువ ఖర్చులో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కంది పంట సాగు చేసే రైతులు కిలో విత్తనాలలకు 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంద్ర నాశినితో విత్తన శుద్ధి చేస్తే వేరుకుళ్లు తెగులు రాకుండా చేయవచ్చన్నారు. విత్తనాలు మొలక కట్టుకొనే విధానాన్ని విత్తన శుద్ధి చేసుకొనే పద్ధతులను ఏఈఓ ఎం. సునీల్‌నాయక్ వివరించారు. వీఏఏ లాలారవి, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ బుధవారం మండల పరిధిలోని ఎగువ చర్లోపల్లి, చిలకచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి గ్రామంలో సాగు చేసిన పత్తి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్, అభ జన్ భగీరథ తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. టీఏ నాగరాజు నాయక్, వీఆర్వో చెన్నయ్య, వీఎస్ఏ షెడ్రక్ బాబు, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ తెలిపారు. మండలంలోని వద్దిపాడు, సంగాపురం రైతు సేవా కేంద్రాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటలపై ఆశించు చీడపీడలు, తెగుళ్ల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ సేవలను ప్రతి రైతు వినియోగించుకోవాలన్నారు. మట్టి పరీక్షల నమూనాతో భూమిలో ఉండే లోపాలను తెలుసుకుని సంబంధిత ఎరువులను వాడి మంచి పంటలను పొందొచ్చన్నారు. రైతులు విత్తనాలు కొనే సమయంలో యజమాని నుంచి తప్పని సరిగా బిల్లులు పొందాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు విక్రయిస్తుంటే అలాంటి వాటిని కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులతో కలిగే ప్రయోజనాలు వివరించారు. రైతులు సమస్యలు ఉంటే సంబంధిత వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని ఏఓ కోరారు. వ్యవసాయ సిబ్బంది రమేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: వేసవి పత్తిని పరిశీలిస్తున్న ఏఓ



దొనకొండ: మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణనాయక్

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మండలంలో కౌలు రైతులందరూ కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తిరుమలరావు కోరారు. మండలంలోని పసుపుగల్లులో బుధవారం ఆయన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కౌలు రైతులు సాగుదారు హక్కు పత్రం కోసం రెవెన్యూ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌలు సాగు దారుహక్కు ద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని తెలిపారు. కంది, వరి, మొక్కజొన్న పంటల్లో రైతులు పాటించాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా వనరుల శాఖ వ్యవసాయాధికారి శేషమ్మ వివరించారు. విత్తనాలు నాటే సమయంలో విత్తనశుద్ధి చేస్తే పంటలో చీడపీడలను నియంత్రించవచ్చని తెలిపారు. వ్యవసాయ సహాయకులు కె. గిరిబాబు, బీవీ నరేంద్రబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.